

# రెళ్లా, మొళ్లా

**కొడవటిగంటి కుటుంబరావు**

మొత్తం ముగ్గురూ—తల్లీ, తనూ, భార్యా—వయసువారీగా. ఇందులో ఒక్కొక్కరికీ ఇద్దరు విరోధులు. ముగ్గురి చుట్టూ ఆవరించి ఉండవలసిన జీవితం కార్చిచ్చురూపంతో ముగ్గురి మధ్యా చేరింది.

తన తల్లి అదొక రకం మనిషి. ఆవిడ తన కెన్నడూ అర్థంకాలేదు. ఇప్పుడు తను ఇంగ్లీషు చదివి నూతన సంస్కారం సంపాదించాడని కాదు; ఆవిడ తనకు ఎప్పుడూ పజిల్‌గానే ఉండేది. ఒకచోట కలిసిఉన్న వ్యక్తులు ఎంత తారతమ్యం కలవాళ్ళయినా నూటికీ కోటికీ ఒకసారయినా ఒక్క నిమిషంపాటు ఒకరినొకరు పరిపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతారు. పాతిక సంవత్సరాల కాలంలో కనీసం ఒకసారయినా తను తల్లిని అట్లా అర్థం చేసుకున్నట్టు స్ఫురణ లేదు!

తనకూ, తల్లికీ ఉన్న సంబంధం సవితికొడుక్కూ, సవితితల్లికీ ఉంటే ఏ మాత్రమూ ఆశ్చర్యం ఉండదు. ఆవిడ చిన్నతనంలో తనను చూసినచూపు స్మరించుకుని అసహ్యపడకుండా ఉండగలిగినా ఆశ్చర్యపడటం తప్పదు.

మొదటినుంచీ ఆవిడ ఒకే సూత్రం మీద ఉన్నది: తన కొడుక్కు జీవితంలో సుఖమూ, ఆనందమూ అనేవి ఉండరాదని. తను నవ్వితేనే ఆవిడకు ఆగ్రహం కలిగేది.

తనకోసం ఆవిడ మూడు పూటలా అన్నం వండేది. కాని తను మూడు పూటలా చద్దన్నం తినవలసివచ్చేది! పొద్దున వండిన బాపతు మధ్యాన్నమూ, మధ్యాన్నం మిగిలిన బాపతు రాత్రీ, రాత్రి మిగిలినది మర్నాడు ఉదయమూ తను తినవలసివచ్చేది.

"పొద్దున అంత చద్దన్నం మిగిలితే ఎందుకు మళ్ళీ వండావు? పొద్దున వండకపోతే ఈపూట వేడన్నంతినేవాణ్ణి కద!" అని తను అంటే "చాలదనుకుని వండానురా!" అని కసిరేది.

ఈ చద్దన్నం తనకు ఏ పూటకాపూట సరిపొయ్యేది. లేదా ఏ మజ్జిగ ముద్దలోకో ఉడుకుడుకు వేడి మెతుకులు వచ్చేవి. సొంతంగా చద్దన్నం తినటం కంటెకూడా రోత అయిన విషయం ఏమిటంటే సగం చద్దన్నం తిని సగం వేడన్నం తినటం! మరీ, మజ్జిగలోకి మాత్రం వేడన్నం! పొరపాటున, కాలానికి విపరీతం వచ్చి, చద్దన్నం మిగలక తను వేడన్నమే తినవలసిన యోగం పడితే, ఆ తల్లి ఆ పూట కొడుక్కు ఏదో మహోపకారం చేసినట్టు నటించి ఆ కాస్త కృతజ్ఞతా లేకుండా చేసుకునేది!

భోజనంలోకి తన కేయే పదార్థాలు అసహ్యమో అవే తరుచు వడ్డించేది—పాత చింతకాయ పచ్చడీ, దబ్బకాయ బద్దా మొదలైనవి.

కొంతమంది తల్లుల పెంపకంలో పిల్లలకి మంచిచెడ్డల వివరణ ఎంతో కాలానికి గాని తెలియదు. తన తల్లి విషయంలో అట్లా కాదు; అయిదేళ్లు దాటకపూర్వమే తనకు మంచిచెడ్డ లేవో స్పష్టంగా తెలుసును; తన కిష్టమైనదంతా చెడూ, తనకు పరమ అసహ్యమైనది చాలా మంచీ!

తనతల్లి ఈ విశ్వాసంతోనే కాలం వెళ్ళబుచ్చుకున్నది. జీవితంలో తన కేమాత్రమన్నా ఆనందం కలుగుతుందేమోనని అనుక్షణమూ అతిజాగ్రత్తమీద ఉండేది. అయితే ఆవిడలో విశేషం ఏమిటంటే తనకు కించిత్తయినా ఆనందం ఇవ్వనివాటివల్ల తన కానందం కలుగుతున్నట్టు నటించేది—అది నిజమైన ఆనందం కాదని స్పష్టంచేస్తూ.

దానంతట కలిగేది ఆనందంకాదనీ, మనం బలవంతాన ప్రకృతికి విరుద్ధంగా తెచ్చిపెట్టుకో గలిగిన కించిత్తేదయితే ఉందో అదే నిజమైన ఆనందమనీ ఆవిడ విశ్వసించినట్టు కనిపిస్తుంది.

అయితే, ఇంటో తనూ, ఆవిడ మటుకే అయినంతకాలమూ ఆనందం లేకపోయినా రొష్టులేదు. తన భార్య ఆ కొంపలో అడుగుపెడుతూ ఒక చేతో

ఆనందమూ, రెండోచేత్తో రొష్టూ పట్టు కొచ్చింది.

ఆ తప్పు సంపూర్ణంగా ఏ ఒకరిదీ కాదు. తన భార్య ఆదర్శ ప్రాయురాలైన పత్ని. అంటే తనకు భగవంతుడూ, తల్లిదండ్రులూ ఇచ్చిన భర్త కంటె మరోమగవాడు ప్రపంచంలో లేడని నమ్మి, ఆనమ్మకంవల్ల కలిగే ఆనందంలో ఓలలాడగల మాధురాలు. తనను సరిగా చూడక పూర్వమే తన భార్య తనను సంపూర్ణంగా ప్రేమించిందనీ, ఆ మని షికి సాధ్యమైన ప్రేమ అక్కడే ప్రారం భమై అంతటితోనే ఆగిపోయిందని తెలుసుకోగానే తనగుండె జారిపోయింది. తను ఇంతకంటె కాస్త మానవత్వంగల ప్రేమకోసం ఆశించాడు. కాని విధి అను కూలించలేదు. అయితే తన నిస్పృహ భార్యతో యవ్వన విలాసా లనుభవించ టానికి ఏ మాత్రమూ అడ్డం రాలేదు.

తన భార్యమాత్రం తన పరిపూర్ణ మైన ఆనందాన్ని ఏ మాత్రమూ దాచ లేదు; నిగ్రహించలేదు. తనని కంటిని రెప్పల్లే కపిపెట్టి ఉండే ప్రయత్నంలో ఆవిడ ఒక్కోసారి ఇల్లంతా తల్లకిం దులు చేసేది. తనమీద ఈగ వాలితే గగ్గోలెత్తిపోయేది. ఇటువంటి ప్రవ ర్తన తనకే విడ్డూరంగా ఉన్నప్పటికీ సహృదయంతో తన భార్య ముగ్ధత్వా నికి జాలిపడటానికైనా తను సంసిద్ధు డైనాడు.

కాని తన తల్లి తనకోడల్ని అంత సులభంగా క్షమించలేకపోయింది. తనూ, భార్యా కీచులాడుకోకుండా దాంపత్యం ఆచరించటమే ఆవిడకి విపరీతంగా కని పించింది. ఆవిడ మేలుకుని ఉండగా తమరిద్దరూ గదిలోకివెళ్ళి తలుపు వేసు కుంటేనే ఆవిడమనస్సు గాయమయేది. ఆ గదిలో తమరిద్దరూ వినపడీ వినపడ కుండామాట్లాడుకుంటుంటే ఆగాయంమీద కారం చల్లినట్టయేది. తన కోడలు పొర పాటున నవ్వితే ఆవిడకు ఆత్మహత్య చేసుకోబుద్ధి అయేది. తన కోడలు భర్త అనే ప్రతి మాటకూ అర్థం లేకుండా నవ్వేమనిషి కావటంవల్ల అత్తగారి జీవితం చెప్పరానంత దుర్భరమయింది.

ఆవిడ జీవితానికి రెండే సమస్యలు— తన కోడలు మొగుణ్ణి మిగిలిన అందరి కన్నా వెయ్యింతలుగా ఎందుకు చూడాలి? తన కొడుకు పెళ్ళాం ప్రవర్తనను ఎందు కామోదించాలి? ఆమోదానికీ ఆహ్లాదానికీ ఉండే తేడా వయ్యాకరణుల కెంత తెలు స్తుందో ఆవిడకీ అంతే తెలుసు!

ఇక తనభార్య తనమీద ఏరోజానించీ పగపట్టిందీ తను సరిగా గమనించలేదు. తనని అత్తగారు ఒత్తిడి చెయ్యటమూ, తన భర్త—తను దేవుడల్లే ఆరాధిస్తూ వచ్చిన భర్త—తన పక్షాన ఒక్కమాట ఐనా అనలేకపోవటమూ ఆమె గమనించి ఉండాలి.

ఒకసారి తనభార్య తనతో ఆవిడ






చాల థాంక్స్ మ్యాడమ్!!
ఈయన కళ్లు తెరిపించావ్!!!

పడే కష్టాలన్నీ చెప్పుకోవటం మొదలు పెడితే తను విసుగ్గా, "నాతో ఇదంతా ఎందుకు చెబుతావు? నేను రోజూ చూడ టంలేదా, వినటంలేదా, ఊహించుకోవటం లేదా?" అన్నాడు.

తన భార్యమనస్సు విరిగిపోయింది. ఆదర్శప్రాయురాలైన పత్నికి మొగుడి మీద మనస్సు విరిగినప్పుడు ఆ విరిగిన మనస్సును సమర్థించటానికి అనదగిన ముక్క ఒకటే ఉంది! "మీరు మారిపోయినారు. మొదట్లో ఇట్లా ఉండే వారు కారు?" తనభార్య తనకీ అమూల్య మైనముక్క అందించింది.

"అయితే మాన్లే!" అన్నాడు తను.

తన తల్లిను గురించి అంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ తన భర్త తనతో మామూలుగా సంసారం చెయ్యటానికి ప్రయత్నించటం మరింత కోపం తెప్పిం చింది భార్యకు. ముగ్ధ లోకజ్ఞానం సంపాదిస్తున్నది అనుభవం ద్వారా.

కాని తనతో తనభార్య, తన తల్లి మీద చాడీలుచెప్పటం మానలేదు. తనకు విసుగెత్తింది. ఒక చిన్న ఉపన్యాసం ఇచ్చాడు:

"కష్టాలు పడటమే కష్టం. వాటిని పదేపదే మననం చేసుకోవటం మరీ కష్టం! ఆ పనిచేసి నువ్వు రెట్టింపు కష్ట పడుతున్నావు. మాఅమ్మ నీకోసం ఇట్లా మారలేదు. ఆవిడ ఎప్పుడూ ఇంతే. నేను పాతిక సంవత్సరాలనించీ ఈదు కొస్తున్నాను. నీకు పాతిక వారాలైనా ఈదటం చాతకాలేదు. నన్నేం చెయ్య మంటావు? నా మీద ఏమైనా ఉంటే నేను పడ్డాటే పడి ఊరుకో. లేదూ,

నీకుచాతనయిన పని ఏదైనా చెయ్యి. కాదంటే ఒట్టుపెట్టు. నామటుకు నేనేమీ చెయ్యలేను. చేసేదీ లేదు—అవిణ్ణి ఏ రాత్రివేళో కట్టగట్టి బావిలో తొయ్యటం తప్ప. అదీ సంగతి!"

ఆ మాటలకు తన భార్య ఏడిచింది.

"మీకు జాలిలేదు...మీరూ, మీ అమ్మా అయినట్టు నే నెందు కవుతా నేమిటి?...మీ అమ్మ బావిలో ఎందుకు పడాలి? మీరూ మీరూ బాగా ఉండండి. నేనే పడతాను...నాకు చేతయిన పని చెయ్యమన్నారుగా? చేస్తాను!" అని తన భార్య తన ఉపన్యాసంలో ముఖ్యమైన అంశాలన్నిటికీ సమాధానం చెప్పింది.

ఆ తరవాత ఆవిడ బావిలో పడ్డది కూడాను! కాని చావలేదు. నలుగురూ కనిపెట్టి తీశారు. ఆ సందర్భంలో చుట్టుపక్క అమ్మలక్కలంతా పోగై తన భార్యయెడల ఎంతో సానుభూతి చూపారు. ఓర్పులేని ముసలిముండలు అత్తగార్లయితే కోడళ్లేం బతుకుతారన్నారు? తన భార్య అంతమంది నించి అటువంటి సానుభూతి పొంది ఎంతకాలమైందో! అవిడ తను చేసిన పనికి చాలా గర్వించింది. అమ్మలక్కలంతా తన అత్తగార్ని తిట్టే తిట్లు ఆవిడకు కర్ణపేయంగా ఉండినై.

ఆవిడ ఆనందాని తనే పాడు చేశాడు. గండం గడిచి, నలుగురూ అవతలికి వెళ్ళిపోయి, పొడిగుడ్డలు కట్టుకుని నీరసంగా మంచంలో పడిఉండగా తను వెళ్ళి భార్యను ఏకాంతంగా ఇంటర్వ్యూచేశాడు. తను ఆ సందర్భంలో అన్నవి రెండే ముక్కలు:


"అదివరకల్లా నీ అపేక్ష చూస్తే నాకు సంతోషం కలగకపోయినా ఆ అపేక్షలో నమ్మకం ఉండేది. ఆ కాస్తా రహితం చేశావు. మొగుడు బతికిఉండగా అపేక్షగల పెళ్ళాం ఆత్మహత్య చేసుకోదు. నాకు కాకుండా పోదామని ప్రయత్నం చేశావు. నీ ప్రయత్నం సాగకపోవటంలో నీతప్పేమీలేదు. కనక నాకు కాకుండా పోయినదానివిగానే ఉండు. ఇక నేను నా జన్మలో నీతో మాట్లాడను. నీకూ నాకూ ఏమీ సంబంధంలేదు. నిన్ను చేసుకున్న పాపానికి నీ ఖర్చు భరిస్తాను—నువ్వెక్కడ ఉన్నా సరే!"

తన భార్య మళ్లీ రోదనం ప్రారంభించింది.

"ఎందు కేడుస్తావు?" అన్నాడు తను. "నువ్వు చచ్చిపోయి ఏం సాధించాలనుకున్నావో అది చావకుండానే సాధించావు. మా అమ్మను అంతా దుమ్మెత్తిపోస్తున్నారు. నీ పగ తీరింది. నామీద ఉన్న ఆశలన్నీ బావిలో పడేటప్పుడే తెంచేశావు! ఇక ఏడుపు దేనికి?"

ఆ మాటలతో తన భార్యకు స్పష్ట





మయింది. తనకు హృదయం లేదని; ఉంటే, లోకమంతా తనని చూసి జాలిపడుతుంటే తను ఒక్కడూ ఎందుకు పడడూ? తనతల్లి వెనకవేసుకురావటంలో మనిషితత్వం తెలియటంలేదూ? అదివరకల్లా దాచిపెట్టాడు కామాలు, ఇప్పుడు తన తల్లిని ఎంతో ఆదరంతో చూస్తున్నాడు!...

రెండురోజులు గడిచినై. తనతల్లి తను ఎంత అనునయించినా దారికి రాకుండా ఉంది. భోజనం చెయ్యదు. నిద్రపోదు. కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తుంది. ఈ ఏడుపంతా రోషమని తనకు తెలుసును. తన కోడలు లోకంయొక్క ఆదరం సంపాదించిందని అవిడ బాధపడుతున్నది.

రెండోరోజు రాత్రి అవిడ కోడలు చేసిన పనే చేసింది— ఆ బావిలోనే దూకింది. మర్నాడు ఆమెశవం తేలింది.

ఈ సంగతి తనకు తెలియగానే మొదట తను చేసిన పని తల్లిప్రవర్త

నను విమర్శించుకోవటం. ఇది Anti-climax. తనతల్లి ఏమాత్రమూ ఉపజ్ఞ లేని పని చేసింది. ఆవిడ కిరసనాయిలు పోసుకుని నిప్పంటించుకున్నా, కనీసం ఇంకో బావిలో పడినా తన మెప్పు సంపాదించుకోగలిగేది. పిచ్చిముండ! ఆవిడకి బతకటం ఎట్లా చాతకాలేదో, చావటం కూడా అట్లాగే చాతకాలేదు.

శవాన్ని పైకి తీశారు. బావిచుట్టూ జనం మూగారు. తన భార్యకూడా ఆడ వాళ్ళ మధ్య కనిపించింది. ఏవరో ముసలావిడ గబగబావచ్చి శవంమీదపడి ఏడుస్తూ. "నీ బతుకిట్లా అయిపోయిందేమే సుబ్బీ? నీ కొడలూ, నీ కొడుకూ చేరి నిన్ను గోతిలో తోశారుచే!" అని బిగ్గిరిగా వాపోవసాగింది.

ఎన్నడో ఆగిపోయిన యంత్రం ఏదో తన హృదయంలో మళ్ళీ ఆడటం మొదలుపెట్టింది. చప్పున భార్యకేసి చూశాడు. భార్య నిర్జీవప్రతిమమాదిరిగా ఉంది. మొహం వెలవెల పోతున్నది. ఊపిరాడక తన్నుకుంటున్నట్టుగా ఉంది.

ఒక్కక్షణంకూడా ఆలస్యం చెయ్యకుండా తను ఆడవాళ్ళల్లో జొరబడి తన భార్యచెయ్యి పట్టుకుని లాక్కుపోయి నాడు. వెనుకనుంచి జనం కేకలుపెట్టటం మొదలు పెట్టారు: "అయ్యొయ్యో? దాన్ని కాస్తా ఏం చేస్తాడో సర్రా!"

తను ఇంట్లో అడుగు పెడుతూనే తలుపులు బిడాయించేశాడు. అవతల తలుపులు దడదడా తట్టుతున్నా లక్ష్యం చెయ్యకుండా తను భార్యను గబగబా నడిపించాడు. ఆమె నడవలేకపోతే చేతుల్లో ఎత్తుకునిపోయి పక్కమీద పడుకోబెట్టాడు.

తన భార్య కటికవాడి చేతికి దొరికిన సాధుమృగంలాగా భయంతో తనకేసి కళ్ళు ఆర్పలేకుండా చూస్తున్నది. తను కూడా పక్కనే కూర్చుని కాస్సేపు భార్య వంక కొత్తగాచూస్తున్నవాడల్లే చూశాడు. తరవాత వంగి ఆవిడని ముద్దుపెట్టుకున్నాడు.

తన భార్య నిలువునా కంపించింది. లేవబోయింది. ఆమెను తన చేతుల్లోకి తీసుకుని గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు.

"ఒళ్ళు తెలియనట్టు పడుకో, నేను వెళ్ళి తలుపులు తెరుస్తాను. లేకపోతే వాళ్ళంతాచేరి తలుపులు పగలగొడతారు!" అన్నాడు తను.





# దెయ్యాలుంటాయి జాగ్రత్త

వెంకట్రావు & లక్ష్మి

ఎత్తుకున్న పేకముక్కల్ని కింద పారేసి బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు రెడ్డి.

"డ్రాప్ చేసావా?" ఆత్రంగా అడిగాడు మూర్తి.

"ఊహూ! బోర్ కొడ్తూందోయ్" అంటూ గోడకు జారగిల బడ్డాడు.

"నే నమ్మను. వెధవ ముక్కలు పడుంటాయి ముందు దబ్బులు కక్కి డ్రాప్ చేసినందుకు" అన్నాడు మూర్తి.

అప్పటికి వరసగా ఆటలు పోగొట్టుకుంటున్నాడు మూర్తి. "కావలిస్తే ముక్కలు తిప్పిచూసుకోవోయ్." కోపంగా అన్నాడు రెడ్డి.

మధ్యలో నేను, రాజు కల్పించుకోక తప్పలేదు.